క్లుప్తంగా

విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండలంలోని మల్కారం సబ్‌స్టేషన్ పరిధిలోని త్రీ ఫేస్ విద్యుత్ కనెక్షన్లకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్కారం సబ్‌స్టేషన్‌లో 33 కేవీలో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో సింగిల్ ఫేస్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

బీఎల్‌ఓల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్ బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులను గుర్తించి, ఓటు హక్కు నమోదుకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు హోమ్ ఓటింగ్‌కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో సదుపాయాల పై దృష్టి సారించాలన్నారు. ఏపీఎం రాంభద్రయ్య, ఆర్‌ఐ మధు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు మంత్రి ఆశీర్వాదం

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క.. నూతన వధూవరులను ఆశీర్వాదించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భజన నర్సింహారావు కుమారుడు భజన సందీప్ వివాహం ఇటీవల జరిగింది. బుధవారం బూర్గంపాడుకు వచ్చిన మంత్రి సీతక్క నూతన దంపతులను ఆశీర్వాదించారు. మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, కాంగ్రెస్ నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, మందా నాగరాజు, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ఇంగువ రమేష్, భజన సతీష్, పాశికంటి నాగమురళి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

బూర్గంపాడు: తల్లిదండ్రుల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి సాధ్యపడుతుందని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అన్నారు. బుధవారం పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆమె మాట్లాడారు. గత మూడేళ్లుగా పాఠశాల అభివృద్ధికి ఎస్‌ఎమ్‌సీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎస్‌ఎమ్‌సీ స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎమ్‌సీ చైర్మన్‌ను, సభ్యులను ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబానికి వితరణ

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు కాలిన బాధిత కుటుంబానికి బుధవారం పలువురు దాతలు వేర్వేరుగా వితరణ అందించారు. మండలంలోని ఆసుపాక కాలనీ గ్రామానికి చెందిన కట్టం రాము, రమాదేవి దంపతుల ఇల్లు పూర్తిగా కాలిపోగా.. అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకు డ ు జూపల్లి రమేష్ యువసేన ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.4,400 నగదుతోపాటు 50కేజీల బియ్యం, నిత్యవసరాలను వితరణగా అందించారు. మామిళ్లవారిగూడేనికి చెందిన దంతనపల్లి సత్యనారాయణ 50 కేజీల బియ్యం, రూ.500 నగదు, ఆసుపాక గ్రామానికి చెందిన పాయం కోటేశ్వరరావు 50 కేజీల బియ్యం, కూరగాయాలను అందజేశారు. కాగా అగ్ని ప్రమాద ఘటనపై స్థానిక ఆర్‌ఐ పద్మావతి వివరాలు సేకరించారు. మాజీ సర్పంచ్ కునసోతు లింగయ్య, పసుపులేటి రాము, నల్లపు భాస్కర్‌రావు, పేరం రఘు, నల్లపు సుబ్బారావు, నల్లపు రామకృష్ణ, షేక్ కరీం, పాయం రాజు, బిర్రం నాగు, విర్నాల నాగు పాల్గొన్నారు.

ఖాసీంకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

అన్నపురెడ్డిపల్లి: రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని బూర్గుడెం గ్రామానికి చెందిన ఖాసీం మృతదేహం వద్ద మంగళవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం నివాళులర్పించారు. ఖాసీం కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఖాసీం జనజను ఖబరస్తాను వరకు మోసుకొని వెళ్లారు. అనంతరం నామవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట నాయకులు పర్సావెంకటేశ్వర్లు, దుబ్బాకుల రాము, మారకాల లక్ష్మారెడి తదితరులు ఉన్నారు.

వణికిస్తున్న వైరల్ ఫీవర్స్

- రోజురోజుకు పెరుగుతున్న జ్వరపీడితులు
- ఎండల తీవ్రతతో డయేరియా కేసులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు



బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న జ్వరపీడితులు

బూర్గంపాడు: ఏజెన్సీలో ఎండలు మండిపోతున్నాయి. ఎండలకు పోటీగా వైరల్ ఫీవర్స్ కూడా ప్రజలను వణికిస్తున్నాయి. డయేరియా కేసులు నమోదవుతున్నాయి. పనులకు వెళ్లేవాళ్లు వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. రోజురోజుకూ జ్వరపీడితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. వర్షాకాలం వచ్చే వైరల్ ఫీవర్స్ మండుటెండల్లోను ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

గ్రామాల్లోనే ఎక్కువ..

బూర్గంపాడులోని ప్రభుత్వ ఆస్పత్రి జ్వరపీడితులతో నిండిపోతోంది. రోజూ 50మంది వరకు జ్వరపీడితులు ఆస్పత్రికి వస్తున్నారు. వీరిలో సగం మంది ఇన్‌పేషంట్‌లుగా చేరుతున్నారు. బూర్గంపాడు మండలంలోని కొన్ని గ్రామాలతో పాటుగా సమీపంలోని ముల్కలపల్లి మండలం నుంచి ఎక్కువ సంఖ్యలో జ్వరపీడితులు ఆస్పత్రికి వస్తున్నారు. అదేవిధంగా బూర్గంపాడుకు సమీపంలోని ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన గ్రామాల ప్రజలు కూడా ఆస్పత్రిలో చేరుతున్నారు. వీరికి రక్త పరీక్షలు నిర్వహించగా వైరల్ ఫీవర్స్, మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నట్లుగా తెలుస్తోంది. వీరిని ఆస్పత్రిలో చేర్చి ఫ్లూయిడ్స్, యాంటీ బయాటిక్ మందులు ఇస్తున్నారు. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని ఇన్‌పేషంట్‌గా చేర్చి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు.

గుండాలపాడు పంచాయతీ దుస్థితి..

బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేవారిలో సగం మంది ముల్కలపల్లి మండలం గుండాలపాడు గ్రామపంచాయతీకి చెందినవారే ఉన్నారు. గుండాలపాడు గ్రామపంచాయతీలోని గుండాలపాడు, కొత్త గుండాలపాడు, చలమన్న నగర్, చింతలపాడు, పగడాల నగర్, చాతవాగు, పాలవాగు గ్రామాలకు చెందిన గిరిజనులు జ్వరాల బారిన పడుతున్నారు. వీరు ప్రతిఏటా వర్షాకాలం, చలికాలం, వేసవికాలంలో జ్వరాల బారిన పడుతూ బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరుతున్నారు. ఈ గ్రామపంచాయతీలోనే ప్రజలు విషజ్వరాలతో ఎక్కువగా బాధపడుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రామ పంచాయతీలోని గ్రామాల నుంచి వచ్చే జ్వరపీడితులలో ఎక్కువమందికి రక్త పరీక్షలు చేస్తే మలేరియాగా నిర్ధారణ అవుతుంది. ఈ గ్రామపంచాయతీలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదు కావటానికి గల కారణాలు వైద్యారోగ్యశాఖ క్షేత్రస్థాయిలో లోతుగా పరిశీలన చేయాల్సిన అవసరముంది. ప్రతి సీజన్‌లో ఈ గ్రామపంచాయతీలో జ్వరాలు పెరగటం, అవి మలేరియా జ్వరాలు కావటంపై అధ్యయనం చేయాల్సిన పరిస్థితులున్నాయి.

ప్రభావం చూపుతున్న ఎండలు

ఎండల తీవ్రతకు జ్వరాలతో పాటుగా డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. రోజు ఐదారుగురు డయేరియాతో ఆస్పత్రిలో చేరుతున్నారు. అదేవిధంగా వడదెబ్బ కేసులు కూడా పెరుగుతున్నాయి. వ్యవసాయ కూలీలు, ఉపాధిహామీ కూలీలు, హమాలీలు, కార్మికులు ఎండల తీవ్రతతో అస్వస్థతకు గురవుతున్నారు. ఎండల్లో పనిచేస్తు డీహైడ్రేషన్‌కు గురై అనారోగ్యం పాలవుతున్నారు. డయేరియా, వడదెబ్బకు గురైన వారు తక్షణమే వైద్యసేవలు పొందకుంటే ఆరోగ్య పరిస్థితి విషమించే అవకాశాలున్నాయి.

జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి



గుండాలపాడు గ్రామపంచాయతీలో జ్వరాలు ఎక్కువున్నాయి. ఏటా వానాకాలం, ఎండకాలం జ్వరాలు వచ్చి అల్లాడుతున్నాం. మాకు బోరు వేసి నీళ్లు ఇస్తున్నారు. ఆ నీళ్ల వల్లనో, దోమల వల్లనో జ్వరాలు మావూళ్లో ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కారం స్వప్న, జ్వర బాధితురాలు, గుండాలపాడు

జ్వరంతో ఆస్పత్రిలో చేరాం



మూడు రోజుల నుంచి నాకు, మా ఆయనకు జ్వరం వస్తోంది. బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకున్నాం. వైరల్ ఫీవర్ అని చెప్పి ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ఇక్కడి ఆస్పత్రిలో మాలాగే చాలామంది జ్వరాలతో చేరారు.

– కాంపాటి శ్రీలత, శ్రీధర గ్రామం

జాగ్రత్తలు పాటించాలి



ఎండలకు ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి. పనులకు వెళ్లే వాళ్లు ఓఆర్‌ఎస్, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. వృద్ధులు, పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో ఎండలకు బయటకు రావద్దు. ఎండలకు జ్వరాల తీవ్రత కూడా పెరుగుతుంది.

– డాక్టర్ సబితారెడ్డి, బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి

16న రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు సత్యనారాయణ

అశ్వారావుపేట(ములకలపల్లి): సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంపై ఈనెల 16వ తేదీన కొత్తగూడెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించనున్న అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణా రైతుసంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలపరిధిలోని మాధారం గ్రామంలో సంఘ జిల్లాకమిటీ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య, దొడ్డ లక్ష్మీనారాయణ, ఊకంటి రవికుమార్, సాంభశివరావు, గడ్డం సత్యనారాయణ, జగన్నాథం, కేశవరావు, గోపగాని లక్ష్మీనర్సయ్య. గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి కానరాకుండా పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సుందరయ్య నగర్ కాలనీకి చెందిన గంజి చిన్న అలియాస్ శ్రీనివాస్ గతనెల 25వ తేదీన ఇంటి నుంచిబయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై విజయలక్ష్మి తెలిపారు.

జన్మదిన వేడుకలు

అశ్వారావుపేట: మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన జూపల్లి కోదండ వెంకట రామారావు యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా ఆయన మిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక అమ్మ సేవాసదనంలో అన్నదానం నిర్వహించారు. కేపీ షఫీ, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

తాగునీరు నాణ్యతగా ఉండాలి



తాగునీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న ఏఈ చంద్రశేఖర్

అశ్వారావుపేటరూరల్: మిషన్‌భగీరథ కింద నిర్దిష్ట ప్రమాణాలతోనే తాగునీటిని సరఫరా చేయాలని ఆ సంస్థ నాణ్యతా ప్రమాణాలు విభాగం (క్వాలిటీ కంట్రోల్) ఏఈ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని మద్దికొండ, జమ్మిగూడెం, అచ్యుతాపురం పంచాయతీలలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా, నీటి నిల్వ, వినియోగం, క్లోరినేషన్ పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ముందుగా మంచినీటి సరఫరాపై నిర్వహించే ఏడుర కాల రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి నీటి సరఫరా, లభ్యత, నాణ్యతను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే క్లోరినేషన్ చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ దీపిక జీతం నిలిపివేత

దుమ్ముగూడెం: మండలంలోని కాశీనగరం గ్రామానికి చెందిన మహిళ సమాఖ్య గ్రామ దీపిక జీతం నిలిపివేసినట్టు ఏపీఎం హేమంతిని బుధవారం తెలిపారు. కాశీనగరం మహిళ సమాఖ్యకు చెందిన స్త్రీ నిధి డబ్బులలో అవకతవకలు చోటుచేసుకోవడంతో విచారణ జరిపి సంబంధిత గ్రామ దీపిక జీతం నిలిపి వేయడం జరిగిందని తెలిపారు. స్త్రీ నిధి నిధులకు సంబంధించి దాదాపు రూ.2.20లక్షలు నిధులు తన సొంతానికి ఉపయోగించుకున్నట్టు విచారణలో తెలియడంతో జీతం నిలుపుదల చేసినట్టు తెలిపారు.

స్త్రీ నిధికి సంబంధించిన నిధులు మాయం కావడం స్వయం సహాయక సంఘాల మధ్య వివాదానికి దారి తీసింది. దీంతో ఆ విషయం అధికారుల దృష్టికి చేరడంతో వివాదంపై అధికారులు విచారణ చేపట్టారు. దీంతో గ్రామ దీపిక రూ.2.20లక్షలు తన సొంత అవసరాలకు ఉపయోగించినట్టు గుర్తించి ఆమె నుంచి రూ.1.70లక్షలను రికవరీ చేశారు. మిగతా సొమ్ము చెల్లించే వరకు జీతం నిలుపుదల చేసినట్టు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు..



గోదావరి వద్ద పనులు పరిశీలిస్తున్న డీఈఎల్‌పీఓ, అధికారులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామ నవమికి వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ సుధీర్‌బాబు సూచించారు. పర్ణశాలలో శ్రీరామ నవమి వేడుకలకు సంబంధించి పంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ పనులతో పాటు తాగునీరు, స్నానఘట్టాల వద్ద దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాట్లలో వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

కోర్టు ఆవరణలో మెడికల్ క్యాంప్



భద్రాచలం(భద్రాచలంఅర్బన్): వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి సూరిరెడ్డి

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలం కోర్టు ఆవరణలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు, మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సూరిరెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం వ్యాయామం, మెడిటేషన్ వంటి వాటిని అవలంభించాలన్నారు. కార్యక్రమంలో జడ్జితో పాటు డాక్టర్లు పవన్, రెడ్డి, జగదీష్ పాల్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ స్పందన పాల్గొన్నారు.



మణుగూరురూరల్: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ ఆవరణలో బార్ అసోసియేషన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. వేసవి ఎండల దృష్ట్యా న్యాయవాదుల కోసం బార్ అసోసియేషన్ వారు వైద్యశిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్క న్యాయవాది వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, మంచినీరు ఎక్కువగా తాగాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు న్యాయవాదులందరికీ వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిర్ర రవికుమార్, న్యాయవాదులు దాసరి కవిత, సర్వేశ్వరరావు, రామ్మోహన్‌రావు, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతి, శ్రీనివాసరావు, అన్వేష్, శైలజ, సావిత్రి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నాగేశ్వరరావు

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని కార్మికులకు ఎనిమిది నెలల పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు అల్లూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడ పని చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరేష్, మనీ, శ్రీలక్ష్మి, మేన ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఆశీర్వదించండి..

అశ్వారావుపేట(ములకలపల్లి): త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఆశీర్వదించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దాల దేవి కోరారు. మండలపరిధిలోని మూకమామిడి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ములకలపల్లి మండలవాసి తాండ్ర వినోదరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఆమె అభ్యర్థించారు. అనంతరం మండల మహిళా మోర్చా కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన పలువురు మహిళలకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఠనగపాటి సీతారాములు, ఓబీజీ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు భానుతేజ, పాలకుర్తి ప్రసాద్, కిషోర్‌కుమార్, తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

మణుగూరుటౌన్: రంజాన్ పవిత్ర మాసం ఉపవాస కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన బుధవారం బాంబేకాలనీలోని మసీదులో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు ఎంతో భక్తితో ఉపవాస దీక్షలు పాటిస్తారని అన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు, ఐఎన్‌టీయూసీ నాయకులు షాబుద్దీన్, నాయుడు, మస్తాన్, జీవరత్నం, యాకూబ్ పాషా, జయరాజు, శ్రీనివాస్, సంతోష్, చరణ్, చౌదరి, కుమారస్వామి, రాము, కిరణ్, గంగయ్య, భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.

అల్లాడిపోతున్న 'ఉపాధి' కూలీలు

- పని ప్రదేశాల్లో కానరాని కనీస సౌకర్యాలు
- అడ్రస్ లేని తాగునీరు, టెంట్లు
- ఏళ్లుగా జాడలేని ప్రథమ చికిత్స కిట్లు



కనీస సౌకర్యాలు లేకుండానే గాండ్లగూడెంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు సౌకర్యాలు కల్పించాలనే ఆదేశాలు బుట్టదాఖలు అవుతున్నాయి. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలను కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలను కింది స్థాయి ఉద్యోగులకు పట్టడం లేదు. దాంతో మండుతున్న ఎండల్లోనే పనులు చేస్తూ, ఉపాధి కూలీలు అల్లాడిపోతున్నారు.

అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గడిచిన కొద్ది నెలలు ఉపాధి హామీ పథకం కింద కొద్ది నెలల క్రితమే పనులు ప్రారంభం కాగా, ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. కానీ ఉపాధి కూలీలకు చట్ట ప్రకారం కల్పించాల్సిన కనీస సౌకర్యాల కల్పనలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు, పని ప్రదేశాల్లో తప్పనిసరిగా కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ ఈ ఆదేశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడం లేదు. దాంతో కూలీలంతా అసౌకర్యాలు, ఎండల్లోనే పనులు చేస్తూ అల్లాడిపోతున్నారు.

మండలం పేరు	జీపీల సంఖ్య	జాబ్‌కార్డుల సంఖ్య	పని చేస్తున్న కూలీలు
అశ్వారావుపేట	30	13600	3324
దమ్మపేట	31	8666	3100
అన్నపురెడ్డిపల్లి	10	3500	2200
చంద్రుగొండ	14	6256	3500
ములకలపల్లి	20	12600	8400
మొత్తం	105	44,622	20,524

కానరాని సౌకర్యాలు..

ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు పని ప్రదేశాల్లో తప్పనిసరిగా తాగునీరు, ఎండ నుంచి రక్షణ కోసం పని ప్రదేశంలోనే గుడారాలు (టెంట్లు) ఏర్పాట్లు చేయాలి. కూలీలు పని చేస్తున్న సమయంలో గాయపడిన, అస్వస్థతకు గురైన వారికి తక్షణమే ప్రథమ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లును పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచాలి. కానీ చాలా పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్‌లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచడం లేదు. ప్రథమ చికిత్స కిట్ల సరఫరాను ఏళ్లుగా నిలిపివేయగా, ఇప్పటికే వాటిని పునరుద్ధరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పని చేస్తున్న కూలీల్లో కొంతమందికి గాయాలు కాగా, పాముకాటు, వడదెబ్బతో అస్వస్థతకు గురైన ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆయా బాధిత కూలీలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇప్పటికైన కూలీలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కూలీలు కోరుతున్నారు.

ఇంటి దగ్గర నుంచే తెచ్చుకుంటున్నాం..

ఉపాధి హామీ పథకం కింద కూలి పనులు చేస్తున్నా. ప్రతి రోజు పనికి ఇంటి దగ్గర నుంచే మంచినీళ్ల బాటిళ్లలో తీసుకొస్తున్నాను. పని చేసే చోట తాగునీరు అందుబాటులో ఉంచడం లేదు. ఎండలు అధికంగా ఉండటంతో ఇంటి దగ్గర నుంచి తీసుకొస్తున్న నీళ్లు కుడా సరిపోవడం లేదు. దాంతో తనతోపాటు కూలీకి వచ్చే వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

– భూక్య అమ్ములు, ఉపాధి హామీ కూలీ, గాండ్లగూడెం

సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

పని ప్రదేశాల్లో తప్పనిసరిగా కూలీలకు తాగునీరు, నీడ కల్పించేందుకు చర్యలు చేపట్టామని అశ్వారావుపేట ఈజీఎస్ ఏపీఓ నరేష్ తెలిపారు. కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండటం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కాగా ప్రథమ చికిత్స కిట్లు అందించాలని ఇప్పటికే పీహెచ్‌సీ వైద్యాధికారులను కోరాం. గ్రామ పంచాయతీకి ఒక కిట్ చొప్పున అందిస్తామని వైద్యులు చెప్పారని, త్వరలోనే అందిస్తారని అన్నారు.

– నరేష్, ఏపీఓ, ఈజీఎస్, అశ్వారావుపేట